అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ హెచ్చరించారు. మియాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శేరిలింగంపల్లి సర్కిల్, చందానగర్ సర్కిల్ పరిధిలోని పలు కాలనీ, బస్తీలలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పలు డివిజన్‌లలో సీసీ రోడ్డు పనుల్లో నాణ్యతాలోపంతో 6 నెలల్లోపే దెబ్బతిని గుంతలమయంగా మారుతున్నాయని, ప్రజలు ఇబ్బందులుపడుతున్నారన్నారు. ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాసిరకం పనులు చేసిన కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇలాంటి పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. ఇలాంటి పరిస్థితులు పునరావృతం అయితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, జీహెచ్ఎంసీ అధికారులు ఎస్ఈ శంకర్‌నాయక్, ఈఈ ప్రసాద్, డీఈ ఆనంద్, ఏఈ సంతోష్, నాయకులు రఘునాథ్‌రెడ్డి, ప్రసాద్, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి, చందానగర్ సర్కిళ్లలో రోజురోజుకు పెరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డికి మదర్ సేవా సమితి చైర్మన్ బద్దం కొండల్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. మంగళవారం ఫిర్యాదును ప్రజాభవన్‌లో ఉన్నతాధికారులకు అందజేసినట్లు ఆయన తెలిపారు. 50 నుంచి 100 గజాల్లో 5, 6 అంతస్తులను అక్రమంగా నిర్మిస్తున్నారని, గతంలో నానక్‌రాంగూడలో అక్రమ నిర్మాణం కూలిన ఘటనలో పది మంది ప్రాణాలు కోల్పోయారని, అదే విధంగా ఇటీవల గచ్చిబౌలి సిద్దిఖ్‌నగర్‌లో 50 గజాల్లో 5 అంతస్తుల భవనం పక్కకు ఒరగడంతో అధికారులు కూల్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఇలా అక్రమ నిర్మాణాలతో స్కూల్ బస్సులు, అంబులెన్స్‌లు కూడ వెళ్ళలేని పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. టౌన్ ప్లానింగ్ సిబ్బంది, అధికారుల అండదండలతోనే ఈ నిర్మాణాలు కొనసాగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని కొండల్‌రెడ్డి కోరారు.


ప్రజాభవన్‌లో ఉన్నతాధికారులకు అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేస్తున్న కొండల్‌రెడ్డి

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం


టీజీఎస్‌పీ 8వ బెటాలియన్‌లో నిర్వహించిన వేడుకల్లో కమాండెంట్ సన్నీ, సిబ్బంది


ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో..


3కే వాక్ ను ప్రారంభిస్తున్న భెల్ ఈడీ కే.బి.రాజా

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని టీజీఎస్‌పీ 8వ బెటాలియన్‌లో మంగళవారం రాజ్యాంగ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. వ్యక్తిగత గౌరవాన్ని కాపాడుతూ నిజాయితీతో భారత రాజ్యాంగం పట్ల విధేయుడనై ఉంటానని సిబ్బందితో కమాండెంట్ సన్నీ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ బీవీ రెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్ రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో..

పటాన్‌చెరు టౌన్: రాజ్యాంగం పలు హక్కులను కల్పించిందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...భారతదేశంలో కుల,మత ,వర్గ విభేదాలు లేకుండా అన్ని రంగాల్లో అందరికీ సమాన అవకాశాలు కల్పించిందన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వెంకటేశం, డాక్టర్ కరుణ కుమారి, ఇతర అధ్యాపకులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్త కాల్చివేత..

దట్టమైన పొగతో ఇబ్బందిపడ్డ వాహనదారులు, కాలనీవాసులు

పటాన్‌చెరు టౌన్: తెల్లాపూర్ మున్సిపాలిటీ ముత్తంగి గ్రామంలో భారీగా పేరుకుపోయిన చెత్తను మున్సిపల్ సిబ్బంది తగలబెట్టారు. దీంతో దట్టమైన పొగ వెలువడడంతో బాటు దుర్వాసన, ఘాటు వాసనలు వ్యాపించడంతో స్థానికులు ఇళ్లలో ఉండలేని పరిస్థితి ఏర్పడింది. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముత్తంగిలో పాశమైలారం ఐడీఏ వెళ్లే రహదారి పక్కన ఉన్న గుంతల్లో పోగైన చెత్తను మంగళవారం సిబ్బంది తగలబెట్టారు. ఐడీఏ పాశమైలారం రోడ్డుపై పొగ ఆవరించడంతో వాహనదారులు దారి కనిపించక ఇబ్బందిపడ్డారు. గతంలోను ఈ గుంతల్లో చెత్త వేస్తున్నారనే విమర్శలు రావడంతో మున్సిపల్ కమిషనర్ కొల్లూరులోని చెత్త డంపింగ్ యార్డ్‌లో చెత్త వేసేలా సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. ఆదేశాలు పట్టించుకోని మున్సిపాలిటీ ఉద్యోగులు చెత్త సేకరణ వాహనాల నుంచి వస్తున్న చెత్తను రోడ్డు పక్కనే వేస్తున్నారు. భారీగా చెత్త పేరుకుపోగానే తగులబెడుతున్నారు. చెత్తను కాల్చకూడదనే ఆదేశాలున్నా తెల్లాపూర్ మున్సిపాలిటీ సిబ్బంది పట్టించుకోవడం లేదు.దీంతో ముత్తంగి కాలనీవాసులు చెత్తను కొల్లూరు డంప్‌యార్డుకు తరలించాలని లేనిపక్షంలో ఆందోళన చేస్తామని కాలనీవాసులు హెచ్చరిస్తున్నారు.

సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామం సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా నిధులు కేటాయిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ప్రజాపాలన వారోత్సవాలలో భాగంగా సీఆర్ఆర్ పథకం ద్వారా నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల పరిధిలో నూతన రోడ్ల నిర్మాణానికి 20 కోట్ల 86 లక్షల రూపాయల నిధులు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని నందిగామ నుండి భానూరు వరకు కోటి రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..... గ్రామాలు, పట్టణాల సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అనంతరం నందిగామ గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 50 వేల రూపాయలతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి రాజేందర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, గోపాల్,. శ్రీశైలం యాదవ్, ఎంపీడీఓ యాదగిరి, పంచాయతీరాజ్ విభాగం డీఈ సురేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

‘అల్ట్రా’ అంతేనా..!

స్కానింగ్ మిషన్ వచ్చి రెండేళ్లయినా వైద్యులు లేరు

- గర్భిణులకు తప్పని తిప్పలు
- ఇదీ శేరిలింగంపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రం దుస్థితి


శేరిలింగంపల్లి పట్టణ ప్రాథమిక కేంద్రం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ సేవలు అందడం లేదు. దీంతో గర్భిణులు ఇబ్బందిపడుతున్నారు. రెండు సంవత్సరాల క్రితం శేరిలింగంపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్ఎస్)లో అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు సంబంధిత డాక్టర్‌ను నియమించకపోవడంతో మెషిన్ నిరుపయోగంగా ఉంది. అత్యధికంగా ప్రసవాలు జరిగే ఆస్పత్రిగా దీనికి పేరుంది. మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. శేరిలింగంపల్లి యూపీహెచ్‌సీ పరిధిలో 8 బస్తీ దవాఖానాలు ఉన్నాయి. దీంతో సాధారణంగా రోగుల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. శేరిలింగంపల్లి మండల పరిధిలోని 8 బస్తీ దవాఖానాలతో పాటు హఫీజ్‌పేట్ యూపీహెచ్‌సీ నుంచి కూడా వైద్య పరీక్షల కోసం పలువురు నిత్యం వస్తుంటారు. అక్కడి డాక్టర్లు పరీక్షల కోసం రోగులను శేరిలింగంపల్లి యూపీహెచ్‌సీకే పంపిస్తారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్నా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంపై రోగులలో ఆగ్రహం వ్యక్తం అవుతోంది.

నెరవేరని లక్ష్యం..

శేరిలింగంపల్లి యూపీహెచ్ఎస్‌లో రెండున్నరేళ్ల క్రితం తెలంగాణ డయాగ్నస్టిక్స్ మినీ హబ్‌ను ఎమ్మెల్యే గాంధీ ప్రారంభించారు.

- అల్ట్రా సౌండ్ స్కానింగ్ సేవలు అందుబాటులోకి వస్తాయని ప్రకటించారు. అల్ట్రా స్కానింగ్‌కు అవసరమైన వైద్య సిబ్బందిని ఇప్పటివరకు నియమించలేదు.
- ఈ హెల్త్ సెంటర్‌లో ఎక్స్‌రే, ఈసీజీ ,అల్ట్రా సౌండ్ స్కానింగ్‌తో రేడియాలజీ విభాగం, 57 రకాల పరీక్షలు చేయడం కోసం ల్యాబ్ ఏర్పాటు చేశారు.
- రేడియాలజీ విభాగంలో ఈసీజీ, ఎక్స్‌రేలు తీస్తున్నప్పటికీ అల్ట్రాసౌండ్ మాత్రం అందుబాటులోకి రాలేదు. దీంతో రోగులు అసౌకర్యానికి గురవుతున్నారు.
- ముఖ్యంగా గర్భిణులకు అవసరాన్ని బట్టి రెండు నుంచి మూడుసార్లు అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేస్తారు. బయట స్కానింగ్ చేసేందుకు ఒకసారి సుమారు రూ. 1500 చెల్లించాల్సి వస్తోందని మహిళలు వాపోతున్నారు.
- శేరిలింగంపల్లి మండల పరిధిలోని గోపన్‌పల్లి, గౌలిదొడ్డి, నెహ్రూనగర్, పాపిరెడ్డి కాలనీ, గంగారం, ఇందిరానగర్, వేమన కాలనీ, మధురానగర్‌లలో బస్తీ దవాఖానాలు ఉన్నాయి. పరీక్షల కోసం ప్రజలు శేరిలింగంపల్లికి వస్తుంటారు.
- ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని రోగులు డిమాండ్ చేస్తున్నారు.


అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్

28న ప్రగతి చక్ర అవార్డుల పంపిణీ

రాయదుర్గం: ఆర్టీసీ సంస్థలో రీజనల్ స్థాయి ప్రగతి చక్ర అవార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఈనెల 28వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు జరుగుతుందని డిపో మేనేజర్ ఎం. మురళీధర్ రెడ్డి మంగళవారం తెలిపారు. ప్రతి మూడు నెలలకోసారి రీజనల్ స్థాయిలో సంస్థ ఉద్యోగులకు అవార్డుల పంపిణీ ఉంటుందని తెలిపారు.

ఏబీవీపీ జాతీయ కమిటీలో హెచ్‌సీయూ విద్యార్థులు


శ్రావణ్


ఆయేషా


శివప్రియతైమాత్


సుమంత్

రాయదుర్గం: అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) జాతీయ కమిటీలో తాజాగా మరో నలుగురికి అవకాశం లభించింది. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో మొత్తం ఐదుమంది ఏబీవీపీ నాయకులకు అవకాశం ఇచ్చారు. ఏబీవీపీ జాతీయ కార్యదర్శిగా హెచ్‌సీయూ ఏబీవీపీ సీనియర్ నాయకుడు శ్రావణ్ బిరాజ్‌ను, జాతీయ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలుగా ఆయేషాఎస్‌కే, ఎస్ఎఫ్‌డి జాతీయ కో కన్వీనర్‌గా శివప్రియతైమాత్, సౌత్ సెంట్రల్ జోన్ సోషల్ మీడియా కన్వీనర్‌గా సుమంత్ పెండెమ్‌ను నియమించారు.

అలరించిన గాత్ర కచేరి



చందానగర్: మాదాపూర్‌లోని సీసీఆర్‌టీలో జరుగుతున్న సంగీత్ సమరోహ్‌లో మంగళవారం స్వర్ శర్మ మనోహరమైన హిందుస్థానీ గాత్ర కచేరి సందర్శకులను అలరించింది. అనంతరం ప్రముఖ గాయకుడు లెజండరీ పండిత్ వసంతరావు దేశ్ పాండే మనువడు రాహుల్ దేశ్ పాండే ప్రదర్శన ఆకట్టుకుంది. సంగీతం, తుమ్రీ క్లాసికల్, సెమీ క్లాసికల్ ఆలపించారు.

నేడు వాహనాల వేలం

రాజేంద్రనగర్: శంషాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గతంలో నార్కోటిక్ డ్రగ్స్ (గంజాయి) అక్రమ రవాణాలో వినియోగించి పట్టుబడిన ద్విచక్ర, త్రిచక్ర (ఆటోలు) వాహనాల వేలం పాటను ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి.దేవేందర్ రావు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు స్టేషన్ ఆవరణలో నిర్వహించనున్నామన్నారు. ఆసక్తి గలవారు ఈ వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు.

హుడా కాలనీలో పోలియో కేంద్రాలు ఏర్పాటు చేయాలి


ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం అందజేస్తున్న హుడా కాలనీ అధ్యక్షులు సత్యనారాయణరావు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల నైబర్‌హుడ్ సొసైటీలో పల్స్ పోలియో కేంద్రాల ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని మంగళవారం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీకి కాలనీ అధ్యక్షులు సత్యనారాయణరావు వినతి పత్రాన్ని అందజేశారు. నల్లగండ్ల నైబర్ హుడ్ సొసైటీ పరిధిలో సుమారు 10 వేల కుటుంబాలు నివసిస్తున్నాయని, చిన్నారులు ఉన్నందున పోలియో కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నవీన్, వాసు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నంది అవార్డు గ్రహీతకు అభినందన


నంది అవార్డుతో నాగ సాహితి

మియాపూర్: జాతీయస్థాయి నంది నాట్యోత్సవంలో నంది అవార్డును సొంతం చేసుకున్న నాగ సాహితీని మంగళవారం అభినందించారు. మియాపూర్ మదీనగూడ కెనరీ ద స్కూల్‌లో చదువుతున్న ఉప్పలపాటి నాగ సాహితీ ఈ నెల 11, 12 తేదీల్లో అరుణాచలంలో జరిగిన 9వ జాతీయస్థాయి నంది నాట్యోత్సవంలో పాల్గొని అవార్డును కైవసం చేసుకుంది. పలుచోట్ల కూచిపూడి ప్రదర్శనలతో నాట్య బిందు, అభినయ లాస్య బిరుదులను సాధించింది. అదే విధంగా లఘునాటికలు రాసి అందులో నటించి అందరి మన్ననలను పొందింది. ఈ సందర్భంగా కెనరీ ద పాఠశాల చైర్మన్ శ్వేతారెడ్డి, ప్రిన్సిపాల్ లిడియా క్రిస్టీనా, స్కూల్ హెడ్ నవీన్‌కుమార్, కో ఆర్డినేటర్లు అపర్ణ, ముక్త, మహేష్ సాహితిని అభినందించారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన

పటాన్‌చెరు టౌన్: రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పటాన్‌చెరు ట్రాఫిక్ ఎస్ఐ రాములు అన్నారు. మంగళవారం పటాన్‌చెరు మండల పరిధిలోని ముత్తంగి సమీపంలో ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి రోజు వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా ఆటో డ్రైవర్లు సెల్‌ఫోన్ మాట్లాడుతూ, రాంగ్ రూట్‌లో నడపవద్దని, అదేవిధంగా ఎక్కడపడితే అక్కడ రోడ్డుపై ఆటోలను నిలపవద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆటోడ్రైవర్లు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కూల్చివేతలు



పటాన్‌చెరు టౌన్: మండల పరిధిలోని ఇంద్రేశం గ్రామంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు మంగళవారం కొనసాగాయి. గ్రామ పరిధిలోని ఆర్.కే-2 నవ్య సెంటర్‌లో రెండు నిర్మాణాలను కూల్చివేశారు.ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి సుభాష్ మాట్లాడుతూ... గ్రామ పంచాయతీ ఇచ్చిన అనుమతులకు మించి నిర్మించిన భవనాలకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. నోటీసు ఇచ్చినా వినకుండా నిర్మాణాలు చేపట్టడంతో కూల్చి వేస్తున్నట్లు తెలిపారు. అనుమతులు మేరకు నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యం


ఆనంద్ (ఫైల్)


రమణ (ఫైల్)

మియాపూర్: వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యమయ్యారు. మియాపూర్ ఎస్ఐ మాణిక్యం తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్‌లోని న్యూ కాలనీకి చెందిన ఎం.ఆనంద్(57) ఈ నెల 19వ తేదీ ఉదయం ఇంటి నుండి బయటకు వెళ్లి మరలా తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో విచారించినా ఆచూకీ లభించలేదు .దీంతో ఆందోళన చెందిన కుమారుడు హరికృష్ణ మంగళవారం మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గత కొంతకాలంగా ఆనంద్‌కు మతిస్థిమితం సరిగా ఉండడం లేదని తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మరో ఘటనలో మహిళ..

ఇంటి నుండి బయటకు వెళ్లిన మహిళ తిరిగి రాలేదు. మియాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ హఫీజ్‌పేటలో నివాసముంటున్న మహిళ రమణ(20) గత నెల 24వ తేదీ ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల విచారించినా ఫలితం లేకపోవడంతో భర్త పి. మురళి మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి..

పటాన్‌చెరు టౌన్: డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ కుర్షిత్ అలీ తెలిపిన వివరాలు ప్రకారం... పటాన్‌చెరు పట్టణంలోని జేపీ కాలనీకి చెందిన జగదీష్(24) సోమవారం ఉదయం డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు జగదీష్ కోసం తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. కుమారుడి అదృశ్యంపై మంగళవారం తండ్రి శ్రీరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 11 కేవీ 8వ బెటాలియన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్, సఫారీ నగర్, కొత్తగూడ విలేజ్, టీజీఎస్‌పీ 8వ బెటాలియన్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

చందానగర్‌లో..

చందానగర్ : మాతృశ్రీనగర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో చెట్లకొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

- విశ్వంభర ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు విశ్వంభర, శిల్ప ఎవెన్యూ, ఎస్ఎంఆర్ అపార్ట్‌మెంట్స్, శ్రీలావిల్లా, వాటర్ వర్క్స్, అపర్ణా విల్లాస్, ఎన్‌కో బిల్డింగ్, డబుల్ బెడ్‌రూమ్స్ ఏరియాలలో విద్యుత్ ఉండదన్నారు.
- మాతృశ్రీనగర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2.00 నుంచి 3.00 గంటల వరకు మాతృశ్రీనగర్‌లో కొంత భాగంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.
- మాధవనగర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 3.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు మాతృశ్రీనగర్ కొంత భాగం , మాధవనగర్ కొంతభాగంలో విద్యుత్ ఉండదన్నారు.

8న ‘శాంతిసరోవర్’లో ప్రత్యేక సదస్సు

రాయదుర్గం: శాంతిసరోవర్‌లోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో డిసెంబర్ 8న ప్రత్యేక సెమినార్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వ్యాపార, వాణిజ్య రంగాలకు చెందిన వారికి ‘పర్సనల్ ఎక్సలెన్స్ ఫర్ బిజినెస్ స్ట్రాటజీ అండ్ సక్సెస్’ అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం ఉంటుంది.అనంతరం మెడిటేషన్ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. శాంతిసరోవర్ డైరెక్టర్ బికె కుల్‌దీప్ దీదీ ఆధ్వర్యంలో సాగే ఈ కార్యక్రమంలో శాంతా బయోటెక్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, చైర్మన్ పద్మభూషణ్ డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి, ఐసీఏ ఇండియా ఫెలో మెంబర్ రామకృష్ణ చౌదరి, టర్కీ బ్రహ్మకుమారీస్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ట్రైనర్, డైరెక్టర్ యోగేష్ శార్దా, మౌంట్‌అబూ ఆర్ట్ కోఆర్డినేటర్ డేవిడ్ కిలోస్వికీ వంటివారు పాల్గొంటారు. లైవ్ మ్యూజిక్ ఉంటుంది. కార్యక్రమంలో పాల్గొనే వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలి. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 8087411206లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

28న ‘ఎస్కీ’లో అంతర్జాతీయ సెమినార్

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎస్కీ) ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన అంతర్జాతీయ సెమినార్ జరుగుతుందని ‘ఎస్కీ’ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు తెలిపారు. ఎస్కీ క్యాంపస్‌లోని సెంటినరీ కన్వెన్షన్ సెంటర్‌లో ఉదయం 10.30 గంటలకు ‘ఇన్నోవేషన్స్ ఇన్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఫర్ సస్టేనబుల్, డెవలప్‌మెంట్’ (ఐఈటీఎస్‌డీ-2024) అనే అంశంపై సెమినార్ ఉంటుందన్నారు. ఇన్‌స్ట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ జి రంగనాథ్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమ ప్రారంభ సమావేశంలో ముఖ్య అతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొంటారన్నారు.

ఇంటింటి సర్వే 78 శాతం పూర్తి


గచ్చిబౌలి రోలింగ్‌హిల్స్‌లో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ఇంట్లో సర్వే చేస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

గచ్చిబౌలి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇంటింటి సర్వే శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ పరిధిలో 78.02 శాతం పూర్తయ్యింది. వెస్ట్ జోనల్ పరిధిలో సోమవారం సాయంత్రం నాటికి 2,65,086 ఇళ్లలో సర్వే జరిగింది. యూసుఫ్‌గూడ పరిధిలో 84.19 శాతంతో 61,185 ఇళ్లు, శేరిలింగంపల్లి సర్కిల్‌లో 70.38 శాతంతో 90,583 ఇళ్లలో, చందానగర్ సర్కిల్ పరిధిలో 84.42 శాతంతో 79,266 ఇళ్లలో, పటాన్‌చెరు సర్కిల్ పరిధిలో 76.51 శాతంతో 34,052 ఇళ్ల సర్వే పూర్తి చేశారు. కాగా శేరిలింగంపల్లి జంట సర్కిళ్లలో కొన్ని కాలనీలలో స్టిక్కరింగ్ చేసినప్పటికీ సర్వే కోసం రాలేదని స్థానికులు చెబుతున్నారు.

ఘనంగా మహా పడిపూజ


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ

చందానగర్: హఫీజ్‌పేట్‌లో గొళ్ళ కృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహాపడి పూజను కేశవ్ గురుస్వామి నేతృత్వంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌లు పూజలో పాల్గొన్నారు కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గౌతమ్‌గౌడ్, ప్రసాద్, వెంకటేష్ గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆల్విన్‌కాలనీ..

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని వెంకట పాపయ్య నగర్‌లో మంగళవారం అక్షిత్ మణికంఠ గురుస్వామి, రాంబాబు, నాగతేజ, రామతేజ, నాగరాజు, నర్సింగరావు స్వాముల ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి మహా పడిపూజ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, ఎర్రబెల్లి సతీష్‌రావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

హెరాయిన్ విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

మూసాపేట: హెరాయిన్ విక్రయిస్తున్న ఇద్దరిని కూకట్‌పల్లి పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. కూకట్‌పల్లిలోని మెట్రో పిల్లర్ 794 వద్ద రాజస్థాన్‌కు చెందిన డొల్ల రాము (23), కమలేష్ (26) హెరాయిన్ అమ్ముతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి అమ్మకందారులు, ముగ్గురు(మనప్పర్ లాల్ (23), దేవీలాల్ (26), మాగిలాల్ (24) కొనుగోలుదారులను పోలీసుల అదుపులోకి తీసుకున్నారు. వీరు కూకట్‌పల్లిలోని స్టీల్ షాపులో పని చేస్తున్నారు. వారి నుంచి 15 గ్రాముల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అమ్మకందారులను రిమాండ్‌కు తరలించి, కొనుగోలుదారులకు నోటీసులు ఇచ్చి పంపించారు.